
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 18 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా) 18-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	27
తెనాలి	36	28
నరసరావుపేట	36	26
బాపట్ల	35	28
రెంటచింతల	37	27
చీరాల	35	28



- నియోజక వర్గాల విజన్-2047కు కసరత్తు
- ఎమ్మెల్యే చైర్మన్‌గా కొలువు దీరనున్న బృందం
- సభ్యులుగా ఐదుగురు సచివాలయ ఉద్యోగులు
- విభాగాల వారీగా ప్రతి నెలా ప్రభుత్వానికి నివేదికలు

అభివృద్ధి దిశగా.. అడుగులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వస్తోంది. క్షేత్రస్థాయిలో సమస్యలు.. శాఖల వారీగా కార్యక్రమాల తీరుతెన్నులు.. ప్రజల సంతృప్తి.. తదితరాల ఆధారంగా నియోజకవర్గాల వారీగా ప్రణాళికలపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. స్వర్ణాంధ్ర-2047 సాకారం కావాలంటే ముందుగా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వం తలంచింది. ఇందులో భాగంగానే నియోజకవర్గాల వారీగా కసరత్తుకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టనుంది. దీనికి సమాంతరంగా అక్కడ ఉన్న వనరులు.. ఏ రంగంలో ఉపాధి కల్పనకు అవకాశం ఉంది.. ఇందుకోసం ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారం .. తదితర అంశాల ప్రాతిపదికగా కసరత్తు చేయనున్నారు. విజన్-2047లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే పాత్రను కీలకం చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఎమ్మెల్యే చైర్మన్‌గా, నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవో కన్వీనర్‌గా, ఐదుగురు సచివాలయ ఉద్యోగులు సభ్యులుగా ప్రత్యేక బృందం పనిచేయనున్నది. ఇందుకోసం ఐదుగురు సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియోజకవర్గ కేంద్రంలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టనుంది. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను సైతం మూడు జిల్లాల పరిధిలో అధికారులు పూర్తి చేశారు. ఇక నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేకంగా ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా విభాగాలు తయారు చేసే సవివర ప్రణాళికలను ముందుగా ఎమ్మెల్యేతో వాటి సాధ్యాసాధ్యాలపై చర్చించి నివేదికలను ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. పేదరిక నిర్మూలనతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పన, చివరి ఆయకట్టు వరకు సాగునీరు, గిట్టుబాటు ధరలే తొలి ప్రాధమ్యాలుగా ఉండనున్నాయి. ప్రతినెలా ఆయా కార్యక్రమాల అమలు నివేదికలను ప్రభుత్వానికి పారదర్శకంగా అందించాల్సిన బాధ్యతను సదరు బృందంపైనే ఉంది. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ప్రత్యేక అధికారుల నియామకం జరిగింది. వీరు కూడా బృందంతో కలిసి అడుగు లేయనున్నారు. ఇప్పటికే ప్రతి నెలా మూడో శనివారం ఓ థీమ్‌ను ఎంపిక చేసుకుని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిని మొక్కుబడి తంతుగా మార్చేయకుండా దాని ద్వారా వచ్చిన ఫలితాలపై కూడా ప్రతి మూడు నెలలకొకసారి నియోజకవర్గ బృందాలతో సమీక్షించి సూచనలు చేసే దిశగా కూడా ప్రభుత్వం అడుగులేస్తోంది.

దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులు..

ఇందుకోసం బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించనున్నారు. అయితే ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టినందున ఆయా నియోజకవర్గాల్లో వారి నియామకాల ప్రక్రియకు కొంత ఆటంకం కలుగుతున్నట్లు అధికారుల చెప్తున్నారు. గుంటూరు జిల్లాలో రెండు, బాపట్లలో మూడు, పల్నాడు జిల్లాలో మూడు నియోజకవర్గాలకు ఇంకా ఉద్యోగుల నియామకం జరగలేదంటున్నారు. ఈ నియామక గడువు ఏడాది ఉంటుందని, ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ ముగించామని అధికారులు చెబుతున్నారు.

మట్టి పరీక్షలు.. మొక్కుబడిగా..



పరికొండ పాలెంలో మట్టి నమూనా సేకరణ

నానాటికీ నిస్సారంగా మారుతున్న నేల తల్లిని రక్షించి రైతులకు లబ్ధి చేకూరేలా భూసార పరీక్షలను చేపట్టాలి. ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. సాగుకు రైతులు సన్నద్ధమయ్యే నాటికి భూసార పరీక్షలు పూర్తి చేసి భూ ఆరోగ్య కార్డులు అందజేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో లక్ష్యంలో అర శాతం కూడా చేయ లేదు. మొక్కుబడిగా మట్టి నమూనాలు సేకరించారే కానీ పరీక్షల విషయంలో పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని వ్యవసాయశాఖ లెక్కలు సూచిస్తున్నాయి. సాగుకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో భూసార పరీక్షల కార్డుల కోసం రైతులు ఎదురు చూస్తున్నా వ్యవసాయ శాఖలో చలనం లేదు. మట్టి పరీక్షలకు ఈ నెల 15న గడువు కాగా ఇప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. మూడు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అయితే ఇప్పటకి కేవలం 391 పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలను యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం సంకల్పించగా ఆచరణలో అది అమలు కావడంలేదు. మట్టి నమూనాలను సేకరిస్తున్నారే తప్ప పరీక్షలు నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నెల 15 కల్లా భూసార పరీక్షలు పూర్తి చేసి రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గడువు దాటినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలిస్తే పంటల సాగు ప్రారంభం నాటికి పూర్తయ్యే పరిస్థితులు కూడా కానరావడం లేదు. పరీక్షలే సక్రమంగా జరపలేదంటే ఇక రైతులకు ఏమాత్రం భూసార పరీక్షల కార్డులు అందాయో తెలుసుకోవచ్చు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో పోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. అదే విధంగా ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు తెలియజేస్తారు. నేల ఆరోగ్య పరీక్షలు ఆధారం గానే పంట సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్య పరీక్షలపై రైతులు ఆసక్తి చూపుతున్నా వ్యవసాయశాఖలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

- పుడమి ఆరోగ్య పరీక్షల్లో అలసత్వం
- మూడు జిల్లాల్లో 60,124 పరీక్షల లక్ష్యం
- ఇప్పటికి 391 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి
- గడువు దాటినా వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం

ఇలా సాగితే ఏడాదైనా కష్టమే..

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. 18,158 మట్టి నమూనాలను సేకరించి 388 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. అంటే 2.10 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,287 నమూనాలను సేకరించి రెండింటికి పరీక్షలు పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాలను పరీక్షించాలని లక్ష్యం కాగా ఇప్పటికి 9,784 నమూనాలను సేకరించి ఒక్క నమూనా పరీక్ష మాత్రమే చేశారు. ఇలా మూడు జిల్లాల పరిధిలో సేకరించిన నమునాల పరీక్షలకు ఇంకెన్ని రోజుల సమయం తీసుకుంటారో వ్యవసాయ శాఖ అధికారులకే తెలియాలి. పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి కూడా పూర్తి చేయడం అసాధ్యమని రైతులు చెప్తున్నారు. కనీసం పరీక్షలను వేగవంతం చేసి జూన్ కన్నా భూఆరోగ్య కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

భూసార కార్డులు ఉంటేనే సూక్ష్మపోషకాలు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. రాయితీపై సూక్ష్మపోషకాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఆయా సూక్ష్మపోషకాల పంపిణీకి భూసార కార్డులను తప్పనిసరి చేసింది. ఆయా కార్డుల్లో సూచించిన మేర సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించనున్నా.. ఆ కార్డులు పంపిణీ ఇంతవరకు జరగలేదు. ఈ పరిస్థితుల్లో రైతులకు సకాలంలో సూక్ష్మపోషకాలు ఏమేరకు అందుతాయో తెలియాల్సి ఉంది.

జిల్లా	పరీక్షల లక్ష్యం	నమూనాల సేకరణ
పల్నాడు	23,437	18,158
బాపట్ల	22,825	14,287
గుంటూరు	13,862	9,784



ఉప్పలపాడులో మట్టి నమూనా సేకరణ



ఇన్‌చార్జిలకు క్రీడా సామగ్రిని అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు


వేసవి క్రీడా సామగ్రి పంపిణీ

- శిబిరాలకు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, మే 17 (ఆంధ్రజ్యోతి). ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు అవసరమైన క్రీడా సామాగ్రిని శనివారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జిలు క్రీడా సామగ్రిని కలెక్టర్ నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో క్రీడా శిక్షణలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడా పోటీలలో పాల్గొని పతకాలు సాధించడానికి విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, క్యాంపు ఇన్‌చార్జిలు, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్



మాట్లాడుతున్న జేసీ సూరజ్ ధనుంజయ్, డీఈవో ఎల్ చంద్రకళ

నరసరావుపేట టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్ తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆయా పరీక్షలకు నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 25 కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి జరిగే ఎస్ఎస్సీ పరీక్షలకు జిల్లాలో 4766 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. 19వ తేదీ నుంచి 24 వరకు పది కేంద్రాల్లో జరిగే ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్, ఎస్ఎస్సీ పరీక్షలకు 1464 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా ప్రకటించినందున విద్యార్థులు, పరీక్ష సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని చెప్పారు. సమావేశంలో డీఈవో ఎల్ చంద్రకళ, ప్రభుత్వ పరీక్షలకు అసిస్టెంట్ కమిషనర్ హుస్సేన్,డిపార్ట్మెంట్‌ల అధికారులు పాల్గొన్నారు.

నాడి పట్టేవారేరి?

అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యుల కొరత

- ఏడాదిన్నర నుంచి ఇన్‌చార్జి డాక్టర్లే దిక్కు
- 16 సచివాలయాలు.. మూడు ఆరోగ్య కేంద్రాలు



మాచర్ల : నెహ్రూనగర్ కోర్టు బజారు అర్బన్ హెల్త్ సెంటర్

మాచర్లటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ఆర్భాటంగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ రోగుల నాడి పట్టే వైద్యులను నియమించలేదు. ఏడాదిన్నరగా ఇన్‌చార్జ్ వైద్యులతోనే కాలంవెళ్లబుచ్చుతున్నారు. దీంతో రోగులకు సరైన వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వంలో ఆర్భాటంగా పట్టణంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు. పట్టణంలోని 16 సచివాలయాలను జనాభా ప్రాతిపదికన విభజించి అర్బన్ హెల్త్ సెంటర్లకు కేటాయించారు. గౌడకాలనీ, నెహ్రూనగర్ కోర్టు బజారులో ఒక్కో ఆరోగ్య కేంద్రాన్ని రూ.కోటితో నిర్మించారు. జెండా చెట్టు సెంటర్లో అద్దె భవనంలో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించారు. కోర్టు బజారు అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రహరీ లేదు. నెహ్రూనగర్, ఫైర్‌స్టేషన్, కోర్టు బజారు, అక్బర్‌కాలనీ సచివాలయాలకు సంబంధించి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కోర్టు బజారు ఫైర్ స్టేషన్ వద్ద అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇక్కడ డాక్టర్, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరభద్రస్వామి సచివాలయం, జెండాచెట్టు, పూర్ణయ్య షెడ్డు, లింగబలిజ కాలనీ, బ్యాంకు కాలనీ, రామాలయం సచివాలయాలు పరిధిలోని ప్రజలకు వైద్య సేవల కోసం జెండా చెట్టు వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రంలో కూడా డాక్టర్, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సుద్ధగుంతల, రైల్వే క్వార్టర్స్, సెరిన్‌కాలనీ, రోప్‌వేకాలనీ, వడ్డెరబస్తీ, ఎరుకుల కాలనీ సచివాలయాలు పరిధిలోని ప్రజల కోసం గౌడ కాలనీలో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్లో డాక్టర్ పోస్టుతో పాటు అటెండర్ (ఎల్‌జీఎస్) పోస్టు ఖాళీగా ఉంది. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువగా గర్భిణులకు వైద్య పరీక్షలు, చిన్నారులకు వ్యాక్సినేషన్, రక్త పరీక్షలు, మందులు పంపిణీ జరగాలి. అయితే మూడు కేంద్రాల్లోనూ రోగులను పరీక్షించే వైద్యుడిని నియమించలేదు. రెండు సెంటర్లలో అయితే మందులు ఇచ్చే వారు లేరు. ప్రస్తుతం మూడు అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ ఇన్‌చార్జి డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. ఇన్‌చార్జి వైద్యులపై పనిభారం పెరగడంతో వారు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడం కష్టతరంగా మారింది. ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లపై ప్రత్యేక దృష్టి సారించి రెగ్యులర్ డాక్టర్లను నియమించి పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతులు సమ్మతిస్తేనే భూ సమీకరణ

- డిమాండ్లపై సీఎం చంద్రబాబుతో మాట్లాడతా
- గ్రామసభల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హామీ
- నెమలికల్లు, మండెపూడి రైతులు చేతులెత్తి అంగీకారం

అమరావతి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణానికి రెండో దఫా భూ సమీకరణకు రైతులు సమ్మతిస్తేనే భూములు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఉంగుటూరు, నరుకుళ్లపాడు, నెమలికల్లు, మండెపూడిలో జరిగిన రెవెన్యూ గ్రామ సభల్లో ఆయన ప్రసంగించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి భూములను భూ సేకరణ ద్వారా తీసుకుంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందునే సీఎం చంద్ర బాబునాయుడు రెండోదఫా భూ సమీకరణకు ఒప్పుకున్నారన్నారు. ఈ క్రమంలో వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల పరిధిలో 6,641 ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఉంగుటూరు, నెమలికల్లు, మండెపూడి, నరుకుళ్లపాడు గ్రామాల్లో 6548 ఎకరాల భూమి సమీకరించాల్సి ఉండగా ఎక్కువ శాతం రైతులు సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని, రిటర్నబుల్ ప్లాట్లు ఇన్నర్‌రింగ్ రోడ్డు సమీపంలో ఇవ్వాలని, రాజధాని రైతుల మాదిరిగా కౌలు ఇవ్వాలని, కూలీలు, కౌలు రైతులను ఆదుకోవాలని అభ్యర్థించారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ప్రవీణ్ హామీ ఇచ్చారు. నరుకుళ్లపాడులో కొందరు రైతులు తమ జీవనోపాధి ఎలా అని ప్రశ్నించారు. నెమలికల్లు, మండెపూడిలో భూ సమీకరణకు చేతులెత్తి అంగీకారం తెలిపారు. సభల్లో ఇన్‌చార్జి ఆర్డీవో కుమార్, తహసీల్దారు డానియేలు, ప్రత్యేక అధికారి రాజగోపాల్, ఎంపీడీవో పార్వతి, సర్వేయర్ భాగ్యలక్ష్మి, మద్దిరాల గంగాధర్, విష్ణు, పాపారావు, శౌరయ్య సోమశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్, చేతులెత్తి అంగీకారం

సిందూర్‌కు సంఘీభావం

సత్తెనపల్లి పట్టణంలో భారీ ర్యాలీ

సత్తెనపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం.. జై భారతమాత.. జైజై భారతమాత.. సరిహద్దులోని వీర సైనికుల వెంటే మేమూ.. అంటూ సత్తెనపల్లిలో శనివారం తిరంగా ర్యాలీ జరిగింది. ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో సరైన గుణపాఠం చెప్పిన త్రివిధ దళాలకు సంఘీభావంగా పట్టణ ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు కూటమి నేతలు, పట్టణ ప్రజలు జాతీయ జెండాలతో భారత శౌర్య నిర్వహించారు. ర్యాలీ ముగింపు సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ దేశ ప్రజల సంరక్షణ కోసం ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయంతో మోదీ పాకిస్తాన్ ఉగ్రవాదుల ఆట కట్టించారన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు భారత్ సత్తా ఏమిటో సైన్యం చాటిచెప్పిందన్నారు. దేశ సంరక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తాతా జయప్రకాష్‌నారాయణ, జనసేన నాయకుడు తవిటి భవన్నారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సీఐ నాగమల్లేశ్వరరావుతో పాటు ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, భీమినేని వందనాదేవి, ఆళ్ల అమరేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, బత్తుల నాగేశ్వరరావు, అంకాళ్ల ప్రభుదాసు, పూజల వెంకటకోటయ్య, శిరిగిరి శ్రీనివాసరావు, కోమటినేని శోభారాణి, మన్నవ శారదాదేవి, దరువూరి నాగేశ్వరరావు, బండారు నాగరాజు, బలిజేపల్లి సురేష్‌కుమార్, తురగ మేరీగ్రేస్, తోట అంబిక, మస్తాన్‌వలి, సయ్యద్ పెదకరిముల్లా, సయ్యద్ మాబూ, నూర్ బాషాజాన్ బాబు, ర్యాంబో బుడే, గోగినేని కోటేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, రావిపాటి మధుబాబు తదితర కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో తిరంగా యాత్ర ర్యాలీ



రేపటి నుంచి.. ఈఏపీ సెట్

మూడు జిల్లాల్లో 22 కేంద్రాలు

- 19, 20 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ
- 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

గుంటూరు(విద్య) మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ అగ్రికల్చరల్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే ఏపీఈఏపీ సెట్(ఆన్‌లైన్) పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో బాపట్లలో రెండు, పల్నాడు జిల్లాలో ఐదు, గుంటూరు జిల్లాలో 15 కేంద్రాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ ఫార్మసీ విభాగం విద్యార్థులకు 19, 22 తేదీల్లో, ఇంజనీరింగ్ విద్యార్థులకు 21 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయి. ఆన్‌లైన్ కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా పరీక్షలకు మొత్తం 41,319 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఇంజనీరింగ్ పరీక్షకు 34,148 మంది అగ్రికల్చరల్, ఫార్మసీ పరీక్షకు 7106 మంది హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని కోఆర్డినేటర్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించమని స్పష్టం చేశారు.

సరస్వతి పుష్కరాలకు 24న ఆర్టీసీ స్పెషల్ బస్సు

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు, భక్తుల విజ్ఞప్తి మేరకు గుంటూరు నుండి సరస్వతి నదీ పుష్కరాలకు స్పెషల్ బస్సు ఈ నెల 24న ఏర్పాటు చేసినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ హైటెక్ బస్సు పుష్ బ్యాక్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలి రోజు బస్సు గుంటూరులో రాత్రి 10 గంటలకు బయలు దేరి.. రెండో రోజు ఉదయానికి కాళేశ్వరం చేరుతుందని తెలిపారు. అక్కడ పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు బయలుదేరి.. రామప్ప దేవాలయ దర్శనం, అనంతరం వరంగల్‌లో భద్రకాళి మాత గుడి, వెయ్యి స్తంభాల గుడిని దర్శించి, మూడో రోజు ఉదయాన్నే కొండగట్టు చేరుతుందని తెలిపారు. అక్కడి నుంచి వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న తర్వాత రాత్రి గుంటూరు చేరుతుందన్నారు. ఇతర వివరాలకు 73828 97459, 73828 96403 సంప్రదించాలని కోరారు.

త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జీవీ దంపతులు


ప్రత్యేక పూజలు చేస్తున్న జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు శనివారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి మూలవి రాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రజల శ్రేయస్సు కోరుతూ ప్రత్యేక ప్రార్థన లు చేశారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి తీర్థప్రసా దాలు అందజేశా రు. జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


షేక్ కొలిమి బడే సాహెబ్(ఫైల్)

నకరికల్లు, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లి ఇటుకల బట్టి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఎక్సెల్‌పై వస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ కొలిమి బడే సాహెబ్(69) తన పొలం పనులకు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. ఇటుకల బట్టి సమీపాన రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతూ సాహెబ్ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు వీఎస్ఎస్‌వీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ మెన్ సివిల్, మెకానికల్ తదితర ట్రేడుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, మొబైల్ నంబర్, ఈమెయిల్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో మొత్తం నాలుగు ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 0863-2234720, 83339 73927 ంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



స్పెల్‌బీ టెస్ట్‌లో ప్రీతమ్‌చౌదరి ప్రతిభ



కారంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో నిర్వహించిన స్పెల్ బీ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్‌లో జి.ప్రీతమ్‌చౌదరి జాతీయ స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు. ప్రీతమ్ చౌదరి కారంపూడి. చెన్నైలోని దిశ్రామ్ అకాడమిలో ఆరో తరగతి చదువుతున్నాడు. ప్రీతమ్‌ను తల్లిదండ్రులు రఘుపతి, కృష్ణచైతన్యతో పాటు తాతయ్య సుబ్రహ్మణ్యం, అమ్మమ్మ ఇందిరాదేవి ప్రత్యేకంగా అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మృతుడు కృష్ణా నాయక్

బొల్లాపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరికొండ పాలెం తండాకు చెందిన మేరాజోత్ కృష్ణా నాయక్(38) విద్యుత్ షాక్‌తో శనివారం మృతి చెందాడు. కృష్ణా నాయక్ విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా.. మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు నిర్ధారించాయి. ఎస్ఐ ఎ.బాలకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మల్లేశ్వరి బాయి, ఐదుగురు సంతానం ఉంది.

ప్రారంభమైన పీజీ 4వ సెమిస్టర్ మూల్యాంకనం

పెదకాకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయంలో పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్ష పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమైందని పీజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. మూల్యాంకనానికి సీటీపీగా ఏఎన్‌యూ పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి బాధ్యత వహించనున్నారు. ఆమె మాట్లాడుతూ వర్సిటీలోని ఆర్ట్స్ సైన్స్, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఫార్మసీ కోర్సుల్లోని అధ్యాపకులు మూల్యాంకనంలో భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఆయా విభాగాల పాఠ్య ప్రణాళికా మండలి అధ్యక్షు లు ఎగ్జామినర్లను ఎంపిక చేసి, మూల్యాంక నంలో తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన

పెదకాకాని, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పాత్రికేయ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ఇన్ డ్రోన్ టెక్నాలజీ డిప్లమో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శనివారం అవగాహన కల్పించారు. పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి మాట్లాడుతూ.. మేఘాలయ ప్రభుత్వ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ సలహాదారుడు, వర్సిటీ పూర్వ విద్యార్థి వై.కిషోర్ మెళకువలు నేర్పించారని తెలిపారు. డీజీసీఏ నిబంధనలు, యూఏవీ అప్లికేషన్స్, రిమోట్ సెన్సింగ్, గూగుల్ ఎర్త్ ఇంజన్‌లను వివరించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ విజయ భాస్కర్‌ను అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 22.48టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

సాగర్ సమాచారం

విజయపురిసౌత్, మే 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 900 క్యూసెక్కుల నీటిని దిగువ కు విడుదల చేస్తున్నారు.

గుంటూరు నగర పాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం.876106/2025/A2-2 ది.16-05-2025.

టెండరు కం బహిరంగ వేలము నోటీసు

గుంటూరు నగరపాలకసంస్థకు చెందిన ఆర్.టి.సి.బస్ స్టాండు ఎదురుగా గల డా.కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్టులో రుసుము వసూలు చేసుకొనే హక్కుకు వాటికి 2025-26 సం. నకు ది.01-06-2025 నుండి31-03-2026వరకు లీజు నిర్వర్తించుకొనుటకు టెండరు కం బహిరంగ వేలం ది.26-05-2025న ఉదయం గం॥ 11.00 ల నుండి 11.30 ల వరకు మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లా నందు సీల్డు టెండర్లు స్వీకరించబడును మరియు అదే రోజు గం.11.30 ల నుండి బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగవేలం పూర్తయిన తదుపరి కమీషనరు గారిచే గాని వారిచే నియమించబడిన అధికారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును.

వరుస సంఖ్య	ఐటెం నెం.	అయిటములు	ధరావత్తు మొత్తము	సాల్వెన్సీ/ సెక్యూరిటీ డిపాజిట్టు (రూ)	కౌలు కాలము
1	1	ఆర్‌టిసి బస్ స్టాండు ఎదురుగా గల డా.కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్టులో రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.5,00,000/-	రూ.10,00,000/-	01-06-2025 నుండి 31-03-2026 వరకు

గమనిక:-

1. లీజుదారుడు / గుత్తదారుడు వేలం మొత్తంపై అమలులో ఉన్న జి.యస్.టి 18% ట్యాక్సును తప్పని సరిగా వెల్లించవలెను.
2. హెచ్చు పాట దారుడు / ఖరారు చేయబడిన పాట దారుడు తన యొక్క గాని, కంపెనీ లేఖ ఫారము యొక్క గాని, ఆర్థికపరిస్థితి తెలియజేయు పాట పాడిన మొత్తములో 25 శాతము బ్యాంకు గ్యారంటీ ఏదేని షెడ్యూలు బ్యాంకు నుండి పొంది సకాలంలో ఆఫీసుకు సమర్పించవలెను.
3. అసాధారణ రాజ పత్రము నెం.04, ది.07-02-2025 నియమ నిబంధనల ప్రకారము ఆక్షన్ జరుగును లీజుకు సంబంధించిన షెడ్యూలు ఖరీదు రూ.100/- ది.24-05-2025 సాయంత్రం గం.5-00 లోపు నగరపాలక సంస్థ యొక్క ట్రెజరీ నందు విధిగా చెల్లించి అటుల చెల్లించిన రశీదుతో సాయంత్రము గం 5.30 లోపు ఎ2-2 సీటు నందు షెడ్యూలు తీసుకొనవలెను.

టెండరు ధరావత్తు సొమ్ము ఏదైనా జాతీయ బ్యాంకు నందు కమీషనరు నగరపాలకసంస్థ, గుంటూరు వారి పేరున తప్పనిసరిగా ఒరిజనల్ డిమాండు డ్రాఫ్ట్ తీసుకొని టెండరు షెడ్యూలునకు జతపరచి దాఖలు చేయవలెను ఎట్టి పరిస్థితులలో చెక్కులు స్వీకరించబడవు. సాల్వెన్సీ మరియు ఇ.సి. టెండరుకు ఒరిజినల్ తో పాటు రిజిస్టర్ దస్తావేజు కాపీ, నోటరీ అఫిడవిట్ (under taking) తో సహా 3 రోజుల ముందు దాఖలు చేయవలెను. వేలమునకు సంబంధించి పాటలో పాల్గొనుటకు గాను MRO గారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ సర్టిఫికేట్ ప్రాపర్టీ వాల్యుయేషన్ సర్టిఫికేట్ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో మాత్రమే ఉండవలెను. బహిరంగ వేలములో కూడా ఒరిజనల్ డిమాండు డ్రాఫ్టు, ఒరిజనల్ సాల్వెన్సీ మరియు ఒరిజనల్ ఇ.సి. జతపరచవలెను. గజిట్ నోటిఫికేషన్ కాపీ మునిసిపల్ కార్యాలయము నందు రూ.250/-లు చెల్లించి పొందవలెను.

సదరు లీజులకు దాఖలు చేయబడిన టెండర్లులో హెచ్చు టెండరు గాని లేక బహిరంగ వేలములో హెచ్చు పాటను ఏది ఎక్కువైతే ఆమొత్తము ఆమోదించబడును సదరు టెండరు గాని లేదా వేలమును గాని అంగికరించుటకు మరియు తిరస్కరించుటకు కమీషనరు గారికి అధికారము కలదు. సదరు లీజులు యొక్క టెండరు కం బహిరంగ వేలముపై పునరాలోచనకు గానీ, వాయిదా వేయుటకు గాని నగరపాలకసంస్థ కమీషనరు గారికి పూర్తి అధికారములు కలవు.

ఇతర వివరముల కొరకు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగము నందు కార్యాలయపు పనివేళల యందు ఎ2-2 గుమస్తా గారిని సంప్రదించవలెను.

సం/- కమీషనరు, నగర పాలక సంస్థ, గుంటూరు

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రేస్ లైన్, ఘంటసాలవారి వీధి, గాయత్రినగర్, విజయవాడ, కృష్ణా జిల్లా-520008

సర్ఫేసి చట్టం 2002 ప్రకారం ఇ-వేలం అమ్మకం ప్రకటన (FORMAT X)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇప్పటినుండి చట్టం అని పిలువబడును) క్రింద స్థిర/చరాస్తుల అమ్మకం ప్రకటన.

ఇందుమూలముగా యావన్మందికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు మరియు హామీదారులకు నోటీసు జారీచేస్తూ తెలియచేయునది ఏమనగా కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ వారికి తనఖా పెట్టిన దిగువ తెలిపిన ఆస్తులను సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం అధీకృత అధికారి గారు స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ క్రెడిటార్‌కి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మరియు తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా రాబట్టుకొనుటకు ఇ-వేలం ద్వారా సదరు ఆస్తిని అమ్మకం చేయబడును.దిగువ తెలిపిన ఆస్తిని "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" మరియు "పరిహారం చెల్లింపులేని ప్రాతిపదికపై" అనుపద్ధతిలో అన్నివిధాల, చట్టపరమైన బకాయిలు ఇంకా ఏమైనా వాటితో సహా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ (ఇక మీదట రూల్స్ అని పిలువబడును) లోని రూల్ నెం.8 & 9 ల ప్రకారం అమ్మకం చేయబడును.

1 (1) టర్మ్ లోన్ అకౌంట్ - 96009497113 యొక్క ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) పేరు: ఋణగ్రహీత: శ్రీ జెట్టి కోటేశ్వరరావు, తండ్రి: ప్రభాకరరావు, డి నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ మరియు హామీదారు: శ్రీమతి జెట్టి శైలు, భర్త : జెట్టి కోటేశ్వరరావు, డి నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. మరియు (2) టర్మ్ లోన్ అకౌంట్ - 96009497022 యొక్క ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) పేరు: ఋణగ్రహీత: శ్రీమతి జెట్టి శైలు, భర్త : జెట్టి కోటేశ్వరరావు, డి నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ మరియు హామీదారు: శ్రీ జెట్టి కోటేశ్వరరావు, తండ్రి: ప్రభాకరరావు, డి నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. మొత్తం బకాయి : లోన్ అకౌంట్ నెం.96009497113 క్రింద తేది.02-01-2024 నాటికి రూ.2,83,247/- (అక్షరాల రెండు లక్షల ఎనభై మూడు వేల రెండు వందల నలభై ఏడు రూపాయలు మాత్రమే) మరియు తేది.02-01-2024 నుండి వడ్డీ మరియు టర్మ్ లోన్ అకౌంట్ నెం.96009497022 క్రింద తేది.02-01-2024 నాటికి రూ.2,83,288/- (అక్షరాల రెండు లక్షల ఎనభై మూడు వేల రెండు వందల ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు తేది.02-01-2024 నుండి వడ్డీ మరియు రెండు టర్మ్ లోన్ ఖాతాల మొత్తం బకాయి రూ.5,66,535/- (అక్షరాల ఐదు లక్షల అరవై ఆరు వేల ఐదు వందల ముప్పై ఐదు రూపాయలు మాత్రమే).
స్థిరాస్తి వివరములు: (శ్రీ జెట్టి కోటేశ్వరరావు గారి టర్మ్ లోన్ అకౌంట్ నెం. 96009497113 మరియు శ్రీమతి జెట్టి శైలు గారి టర్మ్ లోన్ అకౌంట్ నెం.96009497022 కు కామన్ సెక్యూరిటీ యొక్క స్థిరాస్తి) : గుంటూరు జిల్లా, అమరావతి మండలం, అమరావతి, సమీప డోర్ నెం. 5-25, ఆర్.ఎస్. నెం. 251/B నందు 156.2 చ॥గ॥లు లేదా 130.58 చ॥మీ॥లులోని రెసిడెన్షియల్ ఖాళీ స్థలం. హద్దులు : తూర్పు : జెట్టి కృపానందం గారి స్థలం, దక్షిణం : అమరావతి - ధరణికోట పొలిమేర డొంక, పడమర : జెట్టి మోహన రావు గారి స్థలం, ఉత్తరం : జెట్టి చంద్ర శేఖర రావు గారి స్థలం. అమరావతి ఎస్ఆర్ఓ, రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.6730/2015, తేది.31.12.2015 ప్రకారం శ్రీ జెట్టి కోటేశ్వర రావు, తండ్రి: ప్రభాకర రావు గారికి చెందిన ఆస్తి. విస్తీర్ణం : 156.2 చ॥గ॥లు లేదా 130.58 చ॥మీ॥లు.
రిజర్వు ధర: రూ. 8,74,000/- ధరావత్తు సొమ్ము: రూ. 87,400/-

2 (1) టర్మ్ లోన్ అకౌంట్ - 96009671580 యొక్క ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) పేరు: ఋణగ్రహీత : శ్రీమతి కామిరెడ్డి స్పందన, భర్త: తలారి వేణు గోపాల రావు, డి నెం.35-6-63, యేసోబ్ స్ట్రీట్, గిరిపురం, విజయవాడ-520010, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ మరియు హామీదారు(లు): (1) శ్రీ తలారి వేణు గోపాల రావు, తండ్రి : టి. యాకోబు, డి నెం.4-47A, హరిజన వాడ, యస్ సి కాలనీ, అకునూరు-521245, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ మరియు (2) శ్రీ జెట్టి కోటేశ్వరరావు, తండ్రి : ప్రభాకరరావు, డి నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. మరియు (2) టర్మ్ లోన్ అకౌంట్ - 96009671546 యొక్క ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) పేరు: ఋణగ్రహీత : శ్రీ తలారి వేణు గోపాల రావు, తండ్రి: టి. యాకోబు, డి నెం.4-47A, హరిజన వాడ, యస్ సి కాలనీ, అకునూరు-521245, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. హామీదారు(లు): 1) శ్రీమతి కామిరెడ్డి స్పందన, భర్త : తలారి వేణు గోపాల రావు, డి నెం.35-6-63, యేసోబ్ స్ట్రీట్, గిరిపురం, విజయవాడ-520010, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ మరియు 2) శ్రీ జెట్టి కోటేశ్వరరావు, తండ్రి: ప్రభాకరరావు, డి నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. మొత్తం బకాయి : లోన్ అకౌంట్ నెం.96009671580 క్రింద తేది.08-05-2024 నాటికి రూ.2,02,404/- (అక్షరాల రెండు లక్షల రెండు వేల నాలుగు వందల నాలుగు రూపాయలు మాత్రమే) మరియు తేది.08-05-2024 నుండి వడ్డీ మరియు టర్మ్ లోన్ అకౌంట్ నెం. 96009671546 క్రింద తేది.08-05-2024 నాటికి రూ.2,96,869/- (అక్షరాల రెండు లక్షల తొంభై ఆరు వేల ఎనిమిది వందల అరవై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు తేది.08-05-2024 నుండి వడ్డీ మరియు రెండు టర్మ్ లోన్ ఖాతాల మొత్తం బకాయి రూ.4,99,273/- (అక్షరాల నాలుగు లక్షల తొంభై తొమ్మిది వేల రెండు వందల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే).
స్థిరాస్తి వివరములు: (శ్రీమతి కామిరెడ్డి స్పందన గారి టర్మ్ లోన్ అకౌంట్ నెం.96009671580 మరియు శ్రీ తలారి వేణు గోపాల రావు గారి టర్మ్ లోన్ అకౌంట్ నెం.96009671546 లకు కామన్ సెక్యూరిటీ యొక్క స్థిరాస్తి) : గుంటూరు జిల్లా, అమరావతి మండలం, అమరావతి, పట్నం మాలపల్లి, సమీప డోర్ నెం. 5-57, ఆర్.ఎస్. నెం. 251/B నందు 145.2 చ॥గ॥లు లేదా 121.43 చ॥మీ॥లులోని రెసిడెన్షియల్ స్థలం. అమరావతి ఎస్ఆర్ఓ, రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3174/2022, తేది.21.09.2022 ప్రకారం శ్రీ జెట్టి కోటేశ్వర రావు, తండ్రి: జె ప్రభాకర రావు గారికి చెందిన ఆస్తి. హద్దులు : తూర్పు : గుడిసె చిన రాములు గారికి చెందిన భూమి, దక్షిణం : సర్కార్ బజార్, పడమర : గుడిసె దేవదానం గారి ఇల్లు, ఉత్తరం : గుడిసె ఎస్తేరు మరియు ఇతరులకు చెందిన భూమి. విస్తీర్ణం : 145.2 చ॥గ॥లు లేదా 121.43 చ॥మీ॥లు.
రిజర్వు ధర: రూ. 6,96,000/- ధరావత్తు సొమ్ము: రూ. 69,600/-

ఆసక్తి గల బిడ్డర్లు టైటిల్ డీడ్ మరియు ఇతర అందుబాటులోనున్న డాక్యుమెంట్లను మా సీతారాంపురం బ్రాంచ్‌లో చూసుకోవచ్చును. సంప్రదించండి. ఫోన్ నెం.0866-2434372, మొబైల్ నెం. 79955 74833.

బ్యాంకుకు తెలిసి ఆస్తికి సంబంధించిన ఏవైనా ఎన్‌కంబ్రెన్స్‌లు (ఇతర సౌకర్యం లేదా సంస్థ కొరకు తనఖా పెట్టిన ఆస్తి)	లేవు
అధీకృత అధికారికి తెలిసిన స్థానిక ప్రభుత్వ బకాయిల వివరములు (ఆస్తి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు మొ॥)	సంబంధిత విభాగం వారి ఉత్తర్వుల ప్రకారం
ఇ-వేలం తేది మరియు సమయం	తేది 20-06-2025 ఉ॥ 11.00 గం. నుండి మ॥ 1.00 గం.ల వరకు
వేలం సమయం పొడిగింపు	చివరి 5 నిమిషాల్లో చెల్లుబాటు అయ్యే బిడ్‌పై 5 నిమిషాలు
ఇ-వేలం జరుగు వెబ్‌సైట్	https://sarfaesi.auctiontiger.net
బిడ్లు సమర్పించుటకు ఆఖరి తేది	తేది 19-06-2025, సాయంత్రం 5 గం.ల వరకు
కనీస బిడ్ పెంపుదల సొమ్ము	రూ. 10,000/-
ఆసక్తి గల కొనుగోలుదారు ఆస్తి తనిఖీకు తేది మరియు సమయం	ముందస్తు అనుమతితో బ్యాంకు పనివేళలలో తేది. 18-06-2025 వరకు సా॥ 5.00 గం.లోపు

ఒకవేళ సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన బ్యాంక్ వారికి పైన తెలిపిన ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు కొనుగోలు చేయాలని భావిస్తే వారు కూడా పాల్గొనవచ్చు మరియు ఇ-వేలంకు బిడ్ వేయవచ్చును. ధరావత్తు సొమ్మును అకౌంట్ నెం: 96007821585, ఐఎఫ్ఎస్ కోడ్: COAS0000001. బ్యాంక్ పేరు: కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ బ్రాంచ్, కృష్ణా జిల్లా వారికి జమచేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ క్రియేట్ చేయుటకు, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్ సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొదలైన వాటిలో సహాయం కొరకు సంప్రదించండి: https://sarfaesi.auctiontiger.net, బి-704, వాల్ స్ట్రీట్-II, ఓరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజ్ దగ్గర, ఇల్లిస్ బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006 లేదా శ్రీ. ప్రవీణ్ కుమార్ థేవర్, సెల్: 9722778828, డి: 079-68136842/6837/6875, ఇ-మెయిల్ ఐడి: Praveen.thevar@auctiontiger.net లేదా Support@auctiontiger.net మరియు ఆస్తికు సంబంధించిన వివరములకు ఛీఫ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు. ఫోన్: 70930 53666.

తేది: 16-05-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

రేషన్ పంపిణీపై ఫిర్యాదులు వస్తే చర్యలు

నకరికల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో డీలర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కే పుల్లారావు హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌వోలు వాటర్ ట్యాక్స్‌ను సంబంధిత మాడ్యూల్స్‌లో డేటా ఎంట్రీ నమోదుచేయాలని వీఆర్‌వోలను ఆదేశించారు. శనివారం వీఆర్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లను పరిశీలించి జారీ చేయాలన్నారు.

నేడు మహానాడుకు తరలిరండి..

దాచేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ళలో జరుగుతున్న గురజాల నియోజకవర్గ స్థాయి మహానాడుకి తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ చేయాలి

దాచేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): పల్నాడుప్రాంతంలో ప్రభుత్వభూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించాలని గురజాల నియోజకవర్గ జనసేన నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో జరిగిన భూకుంభకోణాలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి జనవాణి ద్వారా తీసుకెళ్ళినట్టు వివరించారు. మండలంలో పొందుగుల, తక్కెళ్ళపాడు, శ్రీనివాసపురం, తంగెడ గ్రామాల్లో పెదఎత్తున భూములు అన్యాక్రాంతమైనట్టు తెలిపారు. గత ప్రభుత్వంలోని అధికారపార్టీ నాయకులు భూములను అన్యాక్రాంతం చేయటం ఒక ఎత్తయితే తంగెడ వీఆర్‌వోగా పనిచేసిన వ్యక్తి తన కుటుంబసభ్యుల పేరిట 30నుంచి 80 ఎకరాలు రికార్డుల్లో నమోదుచేసినట్టు ఆరోపించారు. జిల్లా అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గురజాల నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కటకం అంకారావు, అంబటి మల్లి, కామిశెట్టి రమేష్, బొమ్ము శ్రీనివాసరావు, పాముల కిషోర్, తోట నాగేశ్వరరావు, గోరసాల ప్రసాదు, మిరియాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి

దాచేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని దాచేపల్లి సీఐ భాస్కరరావు, ఎస్‌ఐలు సౌదర్‌రాజన్, పాపారావులు తెలిపారు. శనివారం దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో ప్రార్థనా మందిరాలు, ఆలయాలు, మసీదుల కమిటీసభ్యులతో సమావేశం నిర్వహించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రెంటచింతల, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయిజంక్షన్ నర్సరీలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం(45) గుర్తించినట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. మద్యంలో పురుగుమందు కలిపి తాగి మృతిచెందాడన్నారు. మెడకు, పొట్టదిగువున కుడివైపు గాయం ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల కోసం సీపీఐ పోరాటం

కారంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీపీఐ పోరాటం చేస్తోందని సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నరసింహపురి ఫ్యాక్టరీ ఉద్యోగుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఉద్యోగుల విషయంలో డాక్టర్ ఆదినారాయణ చూపిన చొరవ మరువలేనిదన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి సుభానితోపాటు ఐదుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.


నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే జూలకంటి

సత్రశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,మే 17(ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డునగల సత్రశాల ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, అందుకు దాతలు ముందుకురావాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శనివారం మండల పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2028 ఆగస్టులో కృష్ణా పుష్కరాలు రాబోతున్నాయని అప్పటి కల్లా ఆలయాన్ని సర్వాంగా సుందరంగా తీర్చి దిద్దే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వపరంగా అందే గ్రాంట్‌కు అదనంగా భక్తులు, దాతల నుంచి స్పందన వస్తే బాగుంటుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఒక గ్రామ వ్యవహారాల్లో ఇతర గ్రామాల వారి జోక్యం వద్దని స్పష్టం చేశారు. పార్టీ మండల అధ్యక్ష పదవి విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆలయ చైర్మన్ పదవి విషయంలో కూడా చర్చ జరిగింది.

పరిశుభ్రత అభివృద్ధికి చిహ్నం

● స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో వక్తలు


పిడుగురాళ్ల: కామేపల్లి సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో రామచంద్రరావు, ఈవోపీఆర్డీ దయాకర్ తదితరులు

పిడుగురాళ్ల, మే 17(ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగావుండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని ఎంపీడీవో రామచంద్రరావు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామస్తులు, అధికారులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు కామేపల్లి సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. పిడుగురాళ్ల ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో 12వ వార్డులోని 7వ సచివాలయంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కడప శ్రీనివాసరావు, ఈవో పి.అంకారావు, జె.వెంకయ్య పాల్గొన్నారు.

● దాచేపల్లి: వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత సాధించిననాడే అభివృద్ధి సాధిస్తామని, స్వర్ణాంధ్ర స్వచ్ఛత దివస్ లక్ష్యం నెరవేరుతుందని తహసీల్దార్ వైవీ కుటుంబరావు తెలిపా రు. మండలంలోని పెదగార్లపాడులో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా గ్రామంలో ర్యాలీలు, మంచినీటి చలివేంద్రాల ప్రారంభం, గ్రామసభ, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో చెత్తనుంచి సంప ద తయారీకేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమం లో ఎంపీడీవో పీ రవికుమార్, ఈవోపీఆర్‌డీ గుప్తా, ఆర్‌ఐ శరత్‌కుమార్, కోరె రామారావు పాల్గొన్నారు.

● మాచవరం: అన్ని గ్రామాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, అప్పుడే వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని ఎంపీడీవో వెంగళరావు తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్జంపాడు సంపద తయారీకేంద్రంలో మొక్కలు నాటారు. అన్ని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

సత్తెనపల్లి రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి అన్నారు. స్థానిక యార్డు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా యార్డు ఆవరణను శుభ్రంచేసి వ్యర్థాలను తొలగించారు. కార్యాలయాన్ని కూడా శుభ్రపరిచారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, యార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సత్తెనపల్లి: మార్కెట్ యార్డు ఆవరణలో వ్యర్థాలను తొలగిస్తున్న యార్డు చైర్మన్ శోభారాణి, సిబ్బంది

● కారంపూడి: మండలంలో స్వచ్ఛాంధ్ర దినోత్సవం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ తా ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, డీటీ కసిన్యానాయక్, డాక్టర్ రమ్య, సీహెచ్‌వో మల్లయ్య, హౌసింగ్ ఏఈ రాజేష్, లాలునాయక్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

● రెంటచింతల: రెంటచింతలలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. మానవహా రంగా ఏర్పడి బీట్ ది హిట్ థీమ్ గురించి గ్రామస్తులకు ఎంపీడీవో కె.సరోజనిదేవి వివరించారు. అలాగే టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఎస్‌ఈ వేంకటరమణ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు.

● దుర్గి: దుర్గిలో ఎంపీడీవో శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథాలయ ఆవరణ, తడిచెత్త, పొడిచెత్త షెడ్‌ల వద్ద మొక్కలు నాటారు.సచివాలయంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఏపీఎం రంగారెడ్డి, ఏవో అమ్మిరెడ్డి, సెక్రటరీ కృష్ణ, గ్రంథాలయ అధికారి వేణుగోపి తదితరులు పాల్గొన్నారు.

పూర్వస్నేహితులు ఆర్థికసాయం

దాచేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వపు మిత్రులు 40 సంవత్సరాల తరువాత తోటి మిత్రుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో వారు స్పందించి ఆర్థికసాయం చేశారు. తమ మిత్రుడు సూరేపల్లి లాలయ్య వ్యవసాయ కార్మికుడిగా జీవిస్తున్నాడు. అతని కుమార్తె వివాహ విషయాన్ని తోటి మిత్రులకు తెలియజేసి సహకరించాలని కోరారు. మిత్రులంతా రూ.లక్ష నగదు, బంగారు ఉంగరం, పట్టుచీర, ఇతర సామాన్లను శనివారం అందజేశారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

సత్తెనపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ ఎన్ నాగమల్లేశ్వరరావు అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోడ్రైవర్ మద్యం సేవించి వాహనాలు నడప కూడదన్నారు. అధికలోడు ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించని ఆటోడ్రైవర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పవన్‌కుమార్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం

మాచర్లటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డులలో అర్హులకు న్యాయం చేసేందుకు తమతోపాటు రేషన్ డీలర్లు కృషి చేయాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఎస్‌డీటీ రమణ, ఆర్‌ఐ అనిల్‌కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కారంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో ఊతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతమున్న రేషన్ కార్డులో కుటుంబసభ్యుల పేర్లు నమోదు కాని వారు, ప్రస్తుత కార్డులో ఏవైనా తప్పులున్నా సరిచేయించుకోవచ్చన్నారు.

నేటి మినీ మహానాడుకు వేలాదిగా తరలిరండి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మే 17(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మార్కెట్‌యార్డులో ఆదివారం జరగనున్న మినీ మహానాడుకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సాయంత్రం 5 గంటలకు మినీ మహానాడు ప్రారంభమవుతుందని, నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వేలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా క్రోసూరులో పార్టీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

జీవనశైలి మార్పుతో బీపీ సమస్యలు

సత్తెనపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో వచ్చే మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి వల్ల బీపీ సమస్య వస్తుందని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాలలో శనివారం ప్రపంచ బీపీడేను నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ బరువును నియంత్రణలో ఉంచుకోవాలని, తక్కువ ఉప్పు, తక్కువ కొవ్వు ఉన్న పదార్థాలే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గిరిరాజు, బీ అరుణ, అనూష, ఫిజియోథెరపిస్టు కరుణకుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, హెడ్ నర్సు మరియమ్మ, ఏఎన్‌ఎం మేరి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్పీ భూముల ఆక్రమణకు సిద్ధం

● అధికారుల జోక్యంతో నిలిచిన పనులు

కారంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): భూబకాసురులు ఎన్‌ఎస్పీ భూములపై కన్నేశారు. కారంపూడిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాకు ఆనుకొని ఉన్న ఎన్‌ఎస్పీ కెనాల్స్‌కు చెందిన 2.50 ఎకరాల భూమిని శనివారం ఆక్రమించుకునేందుకు పట్టపగలే కబ్జాదారులు ముళ్లపొదలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సమీప పొలాల యజమానులు అడ్డుకొని ఎన్‌ఎస్పీ కెనాల్స్ డీఈ రాజన్, ఏఈ రామయ్యకు తెలిపారు. వారి జోక్యంతో పనులు నిలిపివేశారు. ఎన్‌ఎస్పీ భూమి విలువ దాదాపు రూ.కోటి వరకు ఉందని రైతులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌లైన్ల ఓరియంటేషన్‌లో భాగంగా వెల్దుర్తి, ఎన్‌ఎస్‌డ్యాం, రెంటచింతల ఫీడర్ల పరిధిలో ఆదివారం ఉదయం 6నుంచి 7:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రామయ్య శనివారం తెలిపారు. పట్టణంలోని రింగురోడ్డు, రైట్ కెనాల్, కొప్పునూరు, తాళ్లపల్లి, ద్వారకాపురి, రాయవరం, పోలేపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలి

బెల్లంకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): నియంతపాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధానకార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో శనివారం సీపీఐ గ్రామ శాఖ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు.



ప్రభుత్వాస్పత్రిని ఈ-హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేస్తాం

● నాట్కో కేన్సర్ విభాగానికి గ్రేడ్-1 సెంటర్‌గా గుర్తింపు
● త్వరలో రూ.10 కోట్లతో సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

గుంటూరు మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిని ఈ-హాస్పిటల్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి,కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ వెల్లడించారు. మెడికల్ రికార్డుల ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ కోసం ఈ-ఆఫీస్‌కు అవసరమైన 300 కంప్యూటర్లను సాఫ్ట్ వేర్ కంపెనీల సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. శనివారం గుంటూరు నాట్కో సెంటరు సెమినార్ హాలులో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని వైద్య సేవలపై రోగుల సంతృప్తి స్థాయిని మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుపత్రిలో మధురాన్నం ట్రస్ట్ ద్వారా జరుగుతున్న అన్నదానం మినహా మిగిలిన వారు అన్నదానం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. దాతలు దానికి బదులు వీల్ చైర్ వంటివి అందజేయాలని ఆయన సూచించారు. నాట్కో క్యాన్సర్ సెంటరులో 120 పడకలతో పాటు అదనంగా మరో 150 పడకలకు విస్తరిస్తున్నందున ప్రభుత్వం క్యాన్సర్ చికిత్స లెవల్ వన్ ఆసుపత్రిగా గుర్తించినట్లు డాక్టర్ పెమ్మసాని తెలిపారు. పెట్ స్కాన్‌ను ప్రారంభించనున్నందున దీనికి అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవటానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

నర్సింగ్ కళాశాలకు బస్సు విరాళం

ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నర్సింగ్ పాఠశాలకు రూ.35 లక్షల విలువైన బస్సును విరాళంగా ఇచ్చేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, హెచ్‌డీఎస్ సభ్యుడు తులసీ రామచంద్రప్రభు సమావేశంలో ప్రకటించారు. అదేవిధంగా ఆసుపత్రి ఆవరణలో రూ.10 కోట్లతో చేపట్టే సర్వీస్ బ్లాక్ ఎంఓయు పత్రాలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులతో కలసి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి.. రామచంద్ర ప్రభు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని తదితరులు రామచంద్రప్రభును సత్కరించారు. అనంతరం డాక్టర్ యశస్వీ రమణ ప్రచురించిన జీజీహెచ్ సుఖీభవ సమాచార దర్శిని పుస్తకాన్ని మంత్రి, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఎంఓయూను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కి అందజేస్తున్న తులసి రామచంద్రప్రభు

ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

● రోడ్లు ఊడ్చి, మురుగుతీసిన మంత్రి మనోహర్ ● మురుగు కాల్వల నిర్వహణపై ఆగ్రహం ● సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లాల్సిందే..

తెనాలి, మే 17, (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉంటే పట్టణంలోని పౌరులంతా ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తెనాలిలోని శివాజి చౌక్ వద్ద నుంచి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ కార్యాలయం వరకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లోనూ పర్యటించారు. ఈ సందర్భంగా జనం తమ సమస్యలపై వినతిపత్రాలు అందించి, ఏకరవుపెట్టారు. ఓపికగా వృద్ధులు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి మంత్రి సమాధానమిచ్చారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో నిర్వహిస్తామని, ప్రజలు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సచివాలయ సిబ్బంది కూడా ఇకపై ఇంటింటికీ వెళ్లి.. ప్రజల సమస్యలు పరిష్కారంచేసేలా 'ఇంటింటికీ సచివాలయ సిబ్బంది' కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రజలకు మరింత చేరువ అవుతామని, నడవలేని వృద్ధులు, ప్రత్యేక అవసరాలవారికి ఆసరాగా నిలిచేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. అనంతరం పూడిక సరిగా తీయకపోవడంతో రోడ్లపైకి నీరు చేరేలా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో మొత్తం కాల్వల పూడిక తీయాలని మున్సిపల్ కమిషనర్ శేషన్నను ఆదేశించారు. వర్షం వచ్చినప్పుడు చుక్క నీరు కూడా రోడ్లపై నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. తడిచెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని దేశంలోనే తెనాలిలో ఎప్పుడో ప్రారంభించామని, ఇది దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని మనోహర్ పేర్కొన్నారు.


మార్కెట్ సెంటర్‌లో చీపురుపట్టి చెత్త ఊడ్చుతున్న మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహ తదితరులు

జగనన్న కాలనీల కాంట్రాక్టర్లపై కేసులు పెట్టండి

జగనన్న కాలనీ లబ్ధిదారులు తమ సమస్యలను మంత్రి మనోహర్ దృష్టికి తీసుకొచ్చారు. గుత్తేదారులు ఇంటి నిర్మాణానికి అదనంగా ఖర్చవుతుందంటూ రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేశారని తెలిపారు. అయినా.. ఇంటిని నిర్మించక పోగా డబ్బు కూడా తిరిగి ఇవ్వడం లేదని, అప్పట్లో అడిగితే తమపైనే దౌర్జన్యం చేశారని వాపోయారు. దీంతో స్పందించిన మంత్రి పేదల సొమ్ము తీసుకున్న వారిని వదలమని, వారి దగ్గర నుంచి డబ్బు వసూలు చేసి బాధితులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులను మోసగించి డబ్బు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డీఎస్పీ జనార్దనరావును ఆదేశించారు. అంతా పేదలేనని, అప్పులు చేసి మరీ సొంతింటి కోసం అధిక వడ్డీలకు డబ్బు తెచ్చిస్తే వాటిని నొక్కేసి, ఇళ్లు కట్టకుండా పేదలను మోసం చేయడం దారుణమని, వారిని వదలడానికి వీల్లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రితోపాటు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ అధికారి నజీమా బేగం, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, తహసీల్దార్ గోపాల కృష్ణ, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.


జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తామంటూ తమ దగ్గర డబ్బు తీసుకుని ఇళ్లు కట్టకుండా వదిలేశారంటూ మంత్రికి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

లోప 'భూ'యిష్టం

● అన్నదాత సుఖీభవ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ● వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో కనపడని ఖాతా నంబర్లు ● పొరుగు రాష్ట్రాల్లో ఉండే రైతులకు చుక్కెదురు



వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉంది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న రైతుల ఖాతా నంబర్లు వ్యవసాయ శాఖ రికార్డుల్లో చాలా వరకు కనబడడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన రైతులకు చుక్కెదురవుతోంది. సొంత భూమి ఉండి ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న వారికి సంబంధించిన భూమి ఖాతా నంబరు అసలు రిజిస్టర్ కావడం లేదు. 2025లో పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు అయిన రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రెండు ఖాతా నంబర్లు ఉన్న యజమానికి ఒకే ఖాతా నంబరుకు సంబంధించిన భూమి మాత్రమే రిజిస్టర్ అవుతోంది. దీనికి తోడు ఎప్పటికప్పుడు సర్వర్ పని చేయకపోవడంతో దరఖాస్తు ప్రక్రియ ఆగిపోతోంది. వ్యవసాయ శాఖ సిబ్బంది తమ వద్ద మ్యాపు కానటువంటి రైతులను సచివాలయంలో మ్యాపింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ ప్రయత్నం కూడా విఫలం అవుతోంది. మ్యాపింగ్ కానీ రైతులు.. వెబ్‌సైట్‌లో మరో ఆప్షన్ ఇవ్వకపోవడంపై రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టి అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం అమలు అయ్యే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని, సాంకేతిక పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

స్మార్ట్ హీట్ అలర్ట్ కార్డు ఆవిష్కరణ


తాడేపల్లి (కుంచనపల్లి), మే 17, (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఉన్న విపత్తుల సంస్థ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్.. వేడిని తరిమి కొట్టండి థీమ్‌లో భాగంగా సంస్థ రూపొందించిన స్మార్ట్ హీట్ అలర్ట్ కార్డును స్పెషల్ సీఎస్ జయలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు మజ్జిగ, వాటర్ బాటిల్‌తో పాటు స్మార్ట్ హీట్ ఎలెర్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ ప్రాంతంలో నమోదవుతున్న ఉష్ణోగ్రతల వివరాల కోసం కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని తెలిపారు. గంట గంటకు స్థానికంగా ఉష్ణోగ్రతల అంచనా వివరాలు వాటిలో ఉంటాయని..అప్రమత్తంగా వ్యవహరించి వడదెబ్బ బారి నుండి బయటపడొచ్చన్నారు. ఉష్ణోగ్రతల హెచ్చరికలు రంగుల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. బ్లూ కలర్ 35 డిగ్రీల సెంటిగ్రేడ్ అంతకంటే తక్కువ ఉంటే సేఫ్ జోన్ అని, ఎల్లో కలర్ 35-40 డిగ్రీల సెంటిగ్రేడ్ కొంచెం అసౌకర్యమని, ఆరెంజ్ కలర్ 41-44 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉంటే ఎక్కువ అసౌకర్యమని, రెడ్ కలర్ 45 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉంటే తీవ్ర ప్రమాదం కలిగి ఉంటుందని జయలక్ష్మి చెప్పారు. అత్యవసర సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 1800 4250 101లో సంప్రదించాలన్నారు.


కార్డును ఆవిష్కరిస్తున్న స్పెషల్ సీఎస్ జయలక్ష్మి

ఆశలపై అకాల వర్షం

❖ వాతావరణ మార్పులతో నిమ్మ రైతు దిగాలు ❖ పూత రాలి.. తగ్గిన దిగుబడులు ❖ ఎగుమతులు నిలిచి.. ధర నేల చూపులు ❖ కేజీ రూ.80 నుంచి రూ.40 పతనం


నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు


చెట్టుకు తక్కువ సంఖ్యలో పిందె దశలో ఉన్న నిమ్మకాయలు

తెనాలి రూరల్,మే17(ఆంధ్రజ్యోతి): తెనాలి వ్యవసాయ మార్కెట్ నిమ్మకాయల క్రయ విక్రయాలకు పెట్టింది పేరుగా విరాజిల్లుతుంది. ఇక్కడకు తెనాలి, కొల్లిపర, చుండూరు, దుగ్గిరాల వంటి పలు మండలాల నుండి వేలాది ఎకరాల్లో సాగుచేపట్టిన నిమ్మరైతులు కాయలను తెచ్చి మార్కెటింగ్ చేస్తుంటారు. వ్యాపారులు లక్నో, యూపీ, జార్ఖండ్, నేపాల్ వంటి పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు. వేసవి కాలంలో కాయలకు డిమాండ్ ఉండి మంచి ధరలు పలుకుతాయి. దీంతో వేసవిపైనే రైతాంగం ఆశలు పెట్టుకుంటారు. నిమ్మసాగుకు దాదాపుగా సంవత్సరానికి రూ.60 - 80వేల వరకూ పెట్టుబడి అవుతుంది. దీనికి దిగుబడి మూడు దఫాలుగా వస్తాయి. వాతావరణం పూర్తి అనుకూలంగా ఉండి కాపు నిలబడితే రైతు ఆశించినంత దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

వాతావరణం మార్పులతో..

గతేడాది వాతావరణంలో మార్పులతో తొలి కోత ఆశాజనకంగా ఉన్నా.. రెండో కోతలో ఓ మాదిరిగా రైతులు నిలదొక్కుకున్నారు. మూడో కోత నుండి వాతావరణంలో మార్పులతో పూత రాలిపోయింది. దీంతో నిమ్మ దిగుబడి తగ్గింది. డిమాండ్‌కు తగ్గకాయలు లేకపోవడంతో వాటికి ధరలు పెరిగాయి. గత నెలలో కేజీ రూ.130 పలుకగా అదే నెల చివరకు వచ్చే సరికి రూ.80కి ధర దిగిపోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఎగుమతులు తగ్గాయి. దీంతో వారం క్రితం వరకూ కేజీ నిమ్మకాలు రూ. 60 కాగా ప్రస్తుతం రూ.40కి పడిపోయాయి. దీంతో రైతులు గిట్టుబాటు కాదని దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం నిమ్మకాలు ధర ఏ గ్రేడ్ క్వింటా రూ.4 వేలు, బీ గ్రేడ్ రూ.3300గా ఉంది. అకాల వర్షాలే తమ పంటలను దెబ్బతీశాయని రైతులు చెబుతుండగా.. వర్షాల కారణంగా కాయలకు డిమాండ్ లేక ఎగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రవేశాలు పరిమితం..!

◆ ఏఎన్‌యూ పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల కోత ◆ ఆగమేఘాలపై తాత్కాలిక వీసీ, రిజిస్ట్రార్ నిర్ణయం ◆ ఈ మేరకు విభాగాధిపతులకు ఆదేశాలు ◆ పాలక మండలి సభ్యులకు లేని సమాచారం



పెదకాకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తాత్కాలిక అధికారులు నిర్ణయాలు విమర్శలకు తావిస్తున్నాయి. తాజాగా వర్సిటీ తాత్కాలిక ఉన్నతాధికారులు పీజీ కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది పలు అనుమానాలు, అనేక సందేహాలకు దారితీస్తోంది. ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ఆయా విభాగాలకు కేటాయించిన సీట్ల సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఏముందని అధ్యాపకులు అంటున్నారు. వర్సిటీలోని విద్యార్థులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోంది. అతి తక్కువ ఫీజుతో ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ వర్సిటీలు, విద్యా కేంద్రాలను తమ ఉన్నత విద్యకు మార్గంగా ఎంపిక చేసుకుంటున్నారు. పీజీ కోర్సుల్లో సీట్ల సంఖ్యను తగ్గించడం.. పేద, మధ్య తరగతి విద్యార్థులను ఆ కోర్సులకు దూరం చేయడమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పీజీ సైన్స్ కోర్సుల సీట్లకు ఎసరు

వర్సిటీలోని పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్లకు వర్సిటీ ఉన్నతాధికారులు ఎసరు పెడుతున్నారు. బోటనీ, బయో టెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫారెస్ట్రీ తదితర వాటిలో కోర్సుకు 10 నుంచి 15సీట్లు కోత పెడుతున్నారు. దీంతో పేద విద్యార్థులకు పీజీ కోర్సులు మరింత భారం కానున్నాయి.

ప్రైవేటుకు మేలు చేకూర్చేందుకా?

ఏఎన్‌యూలో కొన్ని విభాగాల్లో, ప్రత్యేక కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచడం జరిగింది దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడే విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని ప్రైవేటు కళాశాలలకు లబ్ధి చేకూర్చేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు అంటున్నారు. సాధారణంగా ఇలాంటి నిర్ణయాలు వర్సిటీ పాలక మండలి సభ్యులతో చర్చించి, వారి సలహాలు సూచనలతో ముందుకు సాగాలి. కానీ, పాలక మండలి సభ్యులకు ఏ మాత్రం సమాచారం లేకుండా.. వర్సిటీ రెక్టార్ కూడా సమావేశంలో పాల్గొనకుండానే తాత్కాలిక వీసీ కంచర్ల గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం, కొందరు విభాగాధిపతులు అంతర్గత సమావేశం నిర్వహించారు. వారే నిర్ణయాలు తీసుకుని పలువురు అధ్యాపకులకు అనధికార ఆదేశాలు జారీ చేయడంతో ఆచార్యులు అవాక్కవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, విద్యా శాఖాధికారులు, విద్యా శాఖ మంత్రి వర్సిటీలో విద్యార్థులకు నష్టం వాటిల్లేలా తీసుకుంటున్న నిర్ణయాలను పర్యవేక్షించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

పరిశ్రమలకు మోక్షమెప్పుడు?

● వైసీపీ హయాంలో కుదేలైన రంగం
● జిల్లాల విభజనతో గుంటూరుకు తీవ్ర నష్టం
● పరిశ్రమలున్నా పల్నాడు పరిస్థితి అధ్వాన్నం
● లెక్కకు మాత్రమే పరిమితమైన ఎంఎస్‌ఎంఈలు
● కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కనిపించని మార్పు



గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అత్యంత కీలకమైన జిల్లాగా పేరుపొందిన గుంటూరులో గడిచిన ఆరేళ్లుగా పారిశ్రామిక ప్రగతి అన్నదే కనిపించడం లేదు. గత వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు పరిశ్రమలు రాష్ట్రం వైపు చూసిన దాఖలాలే లేవు. ఆ ప్రభావం జిల్లాపై తీవ్రంగా పడింది. పోయిన అయిదేళ్లలో జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా భారీ పరిశ్రమ వెలుగులోకి రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పటి నాయకుల బెదిరింపులు, వేధింపులు తాళలేక చాలా మంది పక్కచూపులు చూశారు. అప్పటి అధికార పార్టీనేతలకు కప్పం కట్టలేక పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పరిస్థితిలో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు.

● జిల్లాల విభజనతో భారీ దెబ్బ

జిల్లాల విభజనతో విభజిత గుంటూరుకు తీవ్ర అన్యాయం జరిగింది. మెజారిటీ పరిశ్రమలన్నీ పల్నాడుకు వెళ్లిపోయాయి. జిల్లాలో ఉన్న స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు దాదాపు ఖాయిలా అంచుకు చేరుకున్నాయి. అవి మూసివేత ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. పొగాకు ఆధారిత పరిశ్రమల పరిస్థితి కూడా ఆశించినంత స్థాయిలో లేదు. 2022 ఏప్రిల్‌లో జరిగిన జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా, వాటిలో 53 పరిశ్రమలు పల్నాడు జిల్లాకే దక్కాయి. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి భారీ సిమెంటు పరిశ్రమలు, పిడుగురాళ్ల కేంద్రంగా ఉన్న సున్నపు బట్టీల పరిశ్రమ, చిలకలూరిపేట స్పిన్నింగ్, టెక్స్‌టైల్స్ హబ్‌లు అన్నీ పల్నాడు పరమయ్యాయి. ఈ జిల్లాలో కూడా కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేవు. సముద్రతీరం, ఆక్వారంగం విస్తారంగా ఉన్న బాపట్ల జిల్లా పరిస్థితి కూడా ఇంచుమించు అలానే ఉంది. బాపట్ల జిల్లాకు 2 భారీ పరిశ్రమలు పోగా మిగిలిన 26 పరిశ్రమలతో గుంటూరు జిల్లా సరిపుచ్చుకోవాల్సి వచ్చింది.

● ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల గుట్టు

జిల్లాల పునర్విభజన నాటికి ఉమ్మడి గుంటూరులో 15,938 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు ఉండగా, 8 వేల ఎంఎస్‌ఎంఈలు పల్నాడుకు, 1500 ఎంఎస్‌ఎంఈలు బాపట్ల జిల్లాకు వెళ్లాయి. గుంటూరు జిల్లాకు 6,425 పరిశ్రమలు మాత్రమే మిగిలాయి. ప్రస్తుతం ఈ సంఖ్య భారీగా పెరిగింది. గుంటూరు జిల్లాలో 94,189 ఎంఎస్‌ఎంఈలు ఉండగా అందులో సూక్ష్మ పరిశ్రమలే 90,911 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 27,950 ఎంఎస్‌ఎంఈలు ఉండగా, వాటిలో 27,758 సూక్ష్మ పరిశ్రమలు, పల్నాడు జిల్లాలో 34,990 ఎంఎస్‌ఎంఈలకు గానూ 34,695 సూక్ష్మ పరిశ్రమలు ఉన్నాయి. మొత్తం ఎంఎస్‌ఎంఈల్లో 95 శాతానికి పైగా సూక్ష్మ పరిశ్రమలే ఉన్నాయి. గణాంకాలను బట్టి ఎంఎస్ ఎంఈల సంఖ్య పదిరెట్లు పెరిగినట్లు కనిపిస్తున్నా.. దాని వెనక పెద్ద మతలబు ఉన్నట్లు తెలుస్తోంది.ఎంఎస్‌ఎంఈల భావన మార్చడంతో ఈసంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఇళ్ల దగ్గర నడుపుకునే చిల్లరకొట్లు, దుకాణాలు ఎంఎస్‌ఎంఈల జాబితాలో చేర్చారు. కానీ కొత్తగా వచ్చిన ఎంఎస్‌ఎంఈలు జిల్లాలో పెద్దగా లేవని తెలుస్తోంది.

● రెండేళ్లలో వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగాలు శూన్యం

2014- 19 నాటి టీడీపీ ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారంతా కనుమరుగైపోయారు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకూ జిల్లాలో 20 మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా, ఆ తరువాత ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. 2014- 21 మధ్య కాలంలో గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9, మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 20 మెగా భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా 2,485.47 కోట్ల రూపాయల పెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. 2021-24 మధ్య ఈ మూడు జిల్లాల్లో ఒక్క భారీ పరిశ్రమగాని, రూపాయి పెట్టుబడిగానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదని గణాంకాలు చెబుతున్నాయి. కాగా ఈ ఏడాది కాలంలోనూ అదే పరిస్థితి కొనసాగుతుండడం విషాదం

● ఐదేళ్ల గ్రహణం వీడేనా?

గడిచిన ఐదేళ్లలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అనేది జిల్లాలోని యువతకు కలగానే మిగిలిపోయింది. ఖనిజ, సహజ వనరుల జిల్లాగా ఉన్నా, రోడ్లు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల కల్పన విస్తారంగా ఉన్నా జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అంతకం తకూ దిగజారిపోతోంది. ఈ కారణంగా జిల్లాలోని యువతకు పని దొరకడమే కష్టంగా మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశించినవారికి నిరాశే ఎదురవుతోం ది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్కువ పెట్టుబడితో, ఎక్కువ ఉపా ధి కల్పించే ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

శావల్యాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొనియున్న ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి వాటిని త్వరగా పరిష్కరించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసి ని అనిల్‌కుమార్ అధ్యక్షతన ఈనెల 21వ తేదీ ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శనివారం తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పకుండా హాజరై గ్రామాల్లో నెలకొనియున్న ప్రజా సమస్యలను అధికారులు దృష్టికి తేవాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబందించిన పూర్తి స్థాయి సమాచారంతో సమావేశానికి హాజరవ్వాలని తెలిపారు.

సిబ్బంది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ దివస్


స్వర్ణాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పని చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యకరమైన సమాజ స్థాపన కోసం సిబ్బంది పాటుపడతారని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు, ప్రతి మూడో శనివారం నిర్వహించబడుతున్న 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ, వెల్ఫేర్ ఆర్ ఐ.గోపినాథ్ , హోంగార్డ్ ఆర్ఐ కృష్ణ ఏ ఎన్ఎస్ ఆర్ఐ యువరాజ్, పోలీస్ సిబ్బందితో పల్నాడు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పరిసరాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పని చేసేటటువంటి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చుట్టుపక్కల ప్రజలకు ఆదర్శప్రాయంగా నిలవాలన్నారు. తగిన సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇచ్చారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో విస్తృత స్థాయిలో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్ల పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది కూడా ఈ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని తమ పరిసరాలను శుభ్రపరిచారు. ప్రజలకు శుభ్రతపై అవగాహన పెంచేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపు నరసరావుపేట వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక

నరసరావుపేట రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలపరిషత్ వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక ఈ నెల 19వ తేదీన సోమవారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి మురళి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు తప్పకుండ హాజరై ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. వైస్ ఎంపీపీ లక్ష్మి మృతి చెందడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. గత నెలలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసినా ఎంపీటీసీ సభ్యులు ఎన్నికలకు గైర్హాజరు కావడంతో ఉప ఎన్నిక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీవో కృష్ణకుమారి తెలిపారు.

రేపు ముండ్రువారిపాలెం ఉపసర్పంచ్ ఎన్నిక

శావల్యాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికను ఈ నెల 19వతేదీన నిర్వ హించనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపసర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన పాపసాని విజయలక్ష్మి వ్యక్తిగత కారణాలతో తనపదవికి రాజీనామా చేయడంతో అక్కడ ఖాళీ ఏర్పడిందన్నారు. దాంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఖాళీగానున్న ఉపసర్పంచ్ పదవులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. సోమవారం ఉదయం 11గంటలకు ఉపసర్పంచ్ ఎన్నిక ప్రారంభమవుతుందని, గ్రామంలోని వార్డుమెంబర్లు అందరూ ఎన్నికలో పాల్గొని ఉపసర్పంచ్‌ని ఎన్నుకోవాలన్నారు. ఎన్నికల అధికారిగా ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు వ్యవహరిస్తారని తెలిపారు.

సోలార్ విద్యుత్ తయారీపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న అంగలూరు సొసైటీ సీఈవో కే కోటేశ్వరరావు

ఈపూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ తయారీ, వినియోగం గురించి రైతులకు శనివారం అవగాహన కల్పించారు. సొసైటీ సీఈవో కే కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ మఫ్త్ బిజ్లీ యోజన ద్వారా ప్రభుత్వమే మీ ఇంటి పైకప్పు పై సోలార్ ప్యానెల్స్ అమర్చేందుకు సబ్సీడీ అందిస్తుందన్నారు. 3 కేడబ్ల్యూ సామర్థ్యం గల సోలార్ వ్యవస్థను అమర్చడం వల్ల వినియోగదారులు పొందే లాభా ల గురించి వివరించారు. ఇంట్లో ఉపయోగించిన తరువాత మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌కు విక్రయించవచ్చునన్నారు. దాని ద్వారా నెలకు అదనంగా ఆదాయం పొందవచ్చునన్నారు. రాయితీ రూపంలో కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు వరకు ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. బీసీలకు రూ98వేలు రాయితీ రూపంలో చెల్లిస్తుంది. సోలార్ విద్యుత్ వల్ల పర్యావరణ హితమైన శుద్ధమైన విద్యుత్, కార్బన్ ఉద్గారాలు తగ్గించవచ్చును.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

- కారుమంచి సొసైటీ సీఈవో నారాయణ

కారుమంచి(శావల్యాపురం), మే 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగించుకొని ప్రజలు విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని కారుమంచి సొసైటీ సీఈవో యేరువ వెంకటనారాయణ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025లో భాగంగా కారుమంచి సొసైటీ కార్యాలయంలో సూర్యఘర్ పథకంపై గ్రామస్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ 3కేవీ కెపాసిటీతో ఇన్వెర్టర్ కొనుగోలుపై ప్రభుత్వం రూ.78వేలు రాయితీని అందిస్తుందన్నారు. ప్రజలు ఇంటి అవసరాలకు పోను మిగులు విద్యుత్‌ను అమ్ముకోవచ్చన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ అంశంపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో దేవినేని రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి చందన అలంకారం


చందన అలంకారంలో శ్రీవేంకటేశ్వర స్వామి

నరసరావుపేట అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): నరసరావు పేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామికి శనివారం చందన అలంకారం చేశారు. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామిని భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా నేడు లక్ష మల్లెలతో స్వామికి పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

భవనాలు, షాపుల తొలగింపు


భవనాలు, షాపులను తొలగిస్తున్న అధికారులు

వినుకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ విస్తరణపై వినుకొండ మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వినుకొండ శివయ్య స్థూపం సెంటర్లో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో నిరుపయోగంగా ఉన్న పలు భవనాలతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ప్రభుత్వాస్పత్రికి ఎదురుగా ఉన్న షాప్స్‌ల ముందు భాగాలను తొలగిస్తున్నారు. భారీ ప్రొక్లయినర్‌లతో తొలగింపు చర్యలు చేపట్టారు. పెరిగిన ట్రాఫిక్‌తో ప్రజలకు వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులు దృష్ట్యా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నర్సయ్య మృతికి చీఫ్‌విప్ జీవీ సంతాపం

ఈపూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సన్నెబోయిన నర్సయ్య (76) అనారోగ్యంతో కొండ్రముట్లలో మృతి చెందాడు. మృతదేహాన్ని శనివారం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎంపీపీ బైలడుగు రామయ్య, డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్‌రావు, అయినాల కోటేశ్వరరావు, నర్రాకిశోర్‌లు సందర్శించారు. మృతదేహంపై పూలదండ ఉంచి నివాళులర్పించారు. నర్సయ్య కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

వడగాడ్పుల నుంచి జాగ్రత్త తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఈపూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో అధిక వేడి, వడగాడ్పుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డీ వెంకటేశ్వర్లు అన్నారు. ఈపూరులో శనివారం బీట్ దీ హీట్ ప్రధానం అంశంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ కే శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● **వినుకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం నిర్వహించు కార్యక్రమంలో భాగంగా శనివారం బీట్ ద హీట్ అనే అంశం పేరుతో అవ గాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడదెబ్బ నుంచి, వేడి గాలుల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మున్సిపల్ కార్యా లయం వారు చేసిన ప్రత్యేక ఏర్పాట్ల గురించి వివరించారు. ఇందులో భాగంగా చలివేంద్రాల ఏర్పాటు, పశువులకు నీటి సౌకార్యర్థం నీటి తొట్టెల ఏర్పాటు చేయుట, వృద్ధులకు, పిల్లలకు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ దస్తగిరి షకీలా, మున్సిపల్ కమిషనర్ ఎం సుభాష్ చంద్రబోస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే ఇస్మాయిల్, వార్డు కౌన్సిలర్స్, ఎన్‌జీవోలు, మెప్మా సిబ్బంది, వార్డు సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● **నూజెండ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి)** : నూజెండ్లలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఏఈ అల్లాభక్షు మాట్లాడుతూ వేసవిలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగుల్ నాల్, కోటేశ్వరరావు, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత బాల శౌరిరెడ్డి మృతి


గాదె బాల శౌరిరెడ్డి (ఫైల్ ఫొటో)

నాదెండ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాదె బాల శౌరిరెడ్డి (84) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారో గ్యంతో బాధ పడుతున్న ఆయన చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. టీడీపీ మద్దతుతో ఆయన గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా రెండు సార్లు పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి చెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. బాల శౌరిరెడ్డి మృతికి ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, బీ సత్యనారాయణ ఎం జగన్నాధరెడ్డి, వెంకట రామిరెడ్డి, మామిళ్ళపల్లి పోతురాజు, నలమోతు హరిబాబు, గంగా రామారావు సంతాపం వ్యక్తం చేశారు.

నేటి మినీ మహానాడుకు వేలాదిగా తరలిరండి

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మే 17(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మార్కెట్‌యార్డులో ఆదివారం జరగనున్న మినీ మహానాడుకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సాయంత్రం 5 గంటలకు మినీ మహానాడు ప్రారంభమవుతుందని, నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వేలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా క్రోసూరులో పార్టీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్ఎస్పీ భూముల ఆక్రమణకు సిద్ధం

- అధికారుల జోక్యంతో నిలిచిన పనులు

కారంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): భూబకాసురులు ఎన్ఎస్పీ భూములపై కన్నేశారు. కారంపూడిలోని ఆర్అండ్‌బీ బంగ్లాకు ఆనుకొని ఉన్న ఎస్ఎస్పీ కెనాల్స్‌కు చెందిన 2.50 ఎకరాల భూమిని శనివారం ఆక్రమించుకునేందుకు పట్టపగలే కబ్జాదారులు ముళ్లపొదలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సమీప పొలాల యజమానులు అడ్డుకొని ఎన్ఎస్పీ కెనాల్స్ డీఈ రాజన్, ఏఈ రామయ్యకు తెలిపారు. వారి జోక్యంతో పనులు నిలిపివేశారు.

నీటి వనరుల రక్షణ యువత బాధ్యత

- ఈశ్వర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు



కళాశాల రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ వద్ద ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు, పీడీ గంగాధర్, అధ్యాపకులు

నరసరావుపేట టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): నీటి వనరుల రక్షణ అనేది యువత బాధ్యతగా భావించాలని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీ నాగ మల్లేశ్వరరావు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా నీరు - మీరు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేసానుపల్లిలో నీటి వనరుల సంరక్షణ, పర్యావ రణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ నీరు - మీరు లాంటి కార్యక్రమాలు విద్యార్థులకు సమాజంతో అనుబంధాన్ని పెంపొందించే అవకాశాన్ని ఇస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో, వీధుల్లో నీటి స్కోర్ కార్డును ప్రదర్శించాలని కోరారు. నీరు ఎంత మోతాదులో వినియోగిస్తాన్నాం, ఎంత మేరకు వృథా చేస్తున్నాం, నీటి నాణ్య త తదితర పలు వివరాలు ఆ నీటి స్కోర్ కార్డ్‌లో నమోదు చేయవచ్చునని తెలిపారు. తద్వారా నీటి వృథాను కొంత మేరకు నివారించవచ్చునని తెలిపారు. కళాశాల సెక్రటరీ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, చైర్మన్ షేక్ మీరావలి పాల్గొని గ్రామ పెద్దలతో, స్థానిక ప్రజలతో ముఖా ముఖి చర్చలు జరిపారు. గ్రామాభివృద్ధికి నీటి పరిరక్షణ, విద్యా ర్థుల సామాజిక బాధ్యతలపై చర్చలు జరిగినట్లు తెలిపారు.

క్లాప్ మిత్రలకు అవగాహన


యడ్లపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా గ్రామ పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ తదితరులు

యడ్లపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడ్లపాడు గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద బీ ది హీట్ స్కీమ్ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ఆయన పలువురితో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. తడిచెత్త, పొడి చెత్త సేకరణ విధానంపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాల సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో హేమ లతాదేవి, డీఎల్‌పీవో లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, సర్పంచ్ హేమ పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో..

నాదెండ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): నాదెండ్లలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏవీ రమణ, డిప్యూటీ ఎంపీడీవో నిర్మల లక్ష్మీకుమారిలు ఎండ తీవ్రత, వడగాలుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలను వివరించారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, కార్యదర్శి ఎంవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

రూ.14.6లక్షల విలువ చేసే రొటావేటర్, ట్రాక్టర్‌లు, నీళ్ల ట్యాంకర్, ట్రక్కులు స్వాధీనం



పుల్లలచెరువు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్‌లో ట్రాక్టరు అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. శనివారం పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రభాకర్, ఎస్ఐ సంపత్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్ షెడ్డులో ఉంచిన ట్రాక్టరు, రొటావేటర్‌ను దొంగలు అపహరించారు. బాధితులు శంకరరావు, వాగ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నిందితుడు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజయపురం గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్ అలియాస్ మాస్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చేపట్టారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గుట్లపల్లి వద్ద హుస్సేన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నింది తుడు తాను చేసిన దొంగతనాల వివరాలను చెప్పాడు. ట్రాక్టర్, రొటావేటర్, ట్రాక్టరు ట్రక్కు, నీటి ట్యాంకర్, ఇటుకల బట్టి వద్ద ట్రాక్టరు ట్రక్కును దొంగిలించాడు. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.14.6లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిని మార్కాపురం కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. తక్కువ కాలంలో కేసును ఛేదించిన పుల్లలచెరువు పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర


రొంపిచర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, సిబ్బంది

రొంపిచర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ప్రతి 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

కార్పొరేషన్ రుణాల సంఖ్యను పెంచాలి

దళిత బహుజన హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్


మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామితో గోదా రమేష్

రొంపిచర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ రుణాల సంఖ్యను పెంచాలని దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని రాష్ట్ర సచివాల యంలో ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు గత ప్రభుత్వంలో ఎస్సీలకు అందజే యక పోవటం వల్ల రుణాల కోసం ఎక్కువ మంది ఎదు రు చూస్తున్నారని తెలిపారు. వీలైనంత ఎక్కువ రుణాలు లబ్ధిదారులకు అందజే సే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈనెల 10వ తేదీ వరకు దర ఖాస్తు సమయం ఉన్నప్పటికీ 8వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్ పని చేసిం దన్నారు. ఆ తరువాత పని చేయలేదన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్టు రమేష్ పేర్కొన్నారు.

వేసవి ఉష్ణోగ్రతలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి


శావల్యాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

శావల్యాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలను ప్రజలంతా సమర్థవంతంగా ఎదుర్కొని వేసవిని జయించాలని మండల ప్రత్యేకాధికారి ఎం వెంకటరెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్రను సాకారం చేసేందుకు కట్టుబడి ఉంటామని అధికారులు సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. శావల్యాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆవరణలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అధికారులు పరిశీలించారు. వేసవిలో పొలాలకు వెళ్లే పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటితొట్లను తనిఖీ చేశారు. గ్రామసచివాలయంలో ఏర్పాటు చేసిన వాట్సప్ గవర్నెన్స్ క్యూఆర్ కోడ్ బోర్డులను ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, తహసీల్దార్ అర్జున్‌నాయక్, ఎంపీడీవో సీతారామయ్య ఆవిష్కరించారు. అనంతరం వేసవిలో తీసుకోవసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ వేసవిలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, ఉదయం 10గంటల లోపు ఇంటికి తిరిగి వెళ్లాలన్నారు. జనసంచారం ఎక్కువగా ఉన్నచోట్ల టెంట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వాసు బాబు, ఏపీవో రామారావు, పంచాయతీ కార్యదర్శి యాకోబు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్దకు వెళ్లి బియ్యం పంపిణీ చేయాలి

- తహసీల్దార్ రమేష్‌కుమార్

నూజెండ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ ఎండీయూ ఆపరేటర్లను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల మేరకు రేషన్ బియ్యం పంపిణీలో శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయకపోతే క్రిమినల్ కేసు

వినుకొండటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని రేషన్ డీలర్లతో తహసీల్దార్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ పలువురు రేషన్ డీలర్లు కార్డు దారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, సరుకులు సక్రమంగా పంపి ణీ చేయని డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరిం చారు. ప్రభుత్వం పరంగా నూతన కార్డుల మంజూరు కోసం, కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం కార్డుదారులకు అవగాహన కల్పించి ప్రజలకు సమాచారం అందించాల్సిన బాధ్యత రేషన్ డీలర్లపై ఉందని సూచించారు.


పంట కాలువల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్


జొన్నలగడ్డ బ్రాంచ్ కెనాల్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడికాలువ ఆయకట్టు పరిధిలోని పంట కాలువల మరమ్మతులకు నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామం వద్దగల పంట కాలువలు మరమ్మతులు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు శనివారం పంట కాలువ వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. గడచిన ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పంట కాలువల మరమ్మతులను విస్మరించిందని ప్రస్తుత ప్రభుత్వం పంట కాలువల మరమ్మతులపై దృష్టి సారించి నాగార్జునసాగర్ కుడి కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ప్రసాదు, బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం


గేదెలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నూజెండ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : నూజెండ్లలో శనివారం సంగం డెయిరీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ మేనేజర్ ఎం జానకి రామారావు, పశు వైద్యులు ప్రసాదు, శివరామ కృష్ణ, నజీర్, పాల సీతలీకరణ కేంద్రం అధ్యక్షుడు మన్నెపల్లి శ్రీనివాసరావు, అనీల్ కుమార్, సీహెచ్ సుబ్బారావు, సూపర్‌వైజర్లు, రైతులు పాల్గొన్నారు.